క్లుప్తంగా

రేపు కవి సమ్మేళనం

ఎదులాపురం: అంతర్జాతీయ కార్మిక దినోత్సవం మే డే సందర్భంగా టీఎస్ యుటీఎఫ్ ఆధ్వర్యంలో సామాజిక కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు స్వామి, అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. పెన్షనర్స్ భవనంలో సోమవారం సాయంత్రం 5 గంటలకు ప్రముఖ అభ్యుదయ కవి, రచయిత ఉదారి నారాయణ ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహిస్తారన్నారు. కార్మిక దృక్పథం, మహిళా స్వేచ్ఛ, మత సామరస్యం అనే అంశాలపై కవిత్వాలు ఉంటాయన్నారు.

వేబ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు

బోథ్: మండలంలోని పొచ్చరలో నాబార్డు గోదాం వద్ద ప్రహరీ, వేబ్రిడ్జిల నిర్మాణం కోసం మార్కెటింగ్ శాఖ డీఈ శ్యాముల్ ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈమేరకు శనివారం గోదాంల వద్ద కొలతలు తీసుకున్నారు. నిధులు మంజూరుకు ఉన్నతాధికారులకు పంపించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఘనంగా పశువైద్య దినోత్సవం

ఆదిలాబాద్‌టౌన్: పశువుల సంక్షేమం, వాటి ఆరోగ్యాన్ని మెరుగుపర్చడం కోసం పశువైద్యులు కృషి చేస్తున్నారని వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ రామారావ్ రాథోడ్ అన్నారు. శనివారం పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో పశువైద్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బెస్ట్ ఫ్రెండ్స్ హెల్ప్ వెల్ఫేర్ సొసైటీ సహకారంతో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. అదనపు డీఎంహెచ్‌వో శ్రీకాంత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో జిల్లా పశువైద్యాధికారి కిషన్, అసిస్టెంట్ డైరెక్టర్ గోపికృష్ణ, బెస్ట్ ఫ్రెండ్స్ హెల్ప్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ పాల్గొన్నారు.

అదనపు పనిభారం తగ్గించాలి



వినతిపత్రం ఇస్తున్న పంచాయతీ కార్యదర్శులు

ఇంద్రవెల్లి: గ్రామ పంచాయతీల్లో విధులు నిర్వర్తిస్తున్న తమకు పని భారం తగ్గించాలని పంచాయతీ కార్యదర్శులు అన్నారు. శనివారం ఎంపీడీవో పుష్పలతకు వినతిపత్రం అందజేశారు. డీఎస్ఆర్, శానిటేషన్, ఈజీఎస్ పనులతో పాటు రికార్డుల నిర్వహణ, రిపోర్టులు నిర్వహించడం కష్టంగా మారిందన్నారు. ప్రస్తుతం జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సమ్మెలో ఉన్నందున వారి బాధ్యతలను సీనియర్ పంచాయతీ కార్యదర్శులకు ఇవ్వొద్దని ఎంపీడీవోకు విన్నవించారు. కార్యక్రమంలో పంచాయతీ ఈవో సంజీవ్‌రావు, పంచాయతీ కార్యదర్శులు ప్రవీణ్‌కుమార్, రవి, సల్మసుల్తాన, ప్రవీణ్ పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

ఆదిలాబాద్‌రూరల్: హైదబారాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో మే 7న నిర్వహించే తెలంగాణ భరోసా సభ వాల్ పోస్టర్‌ను శనివారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ భవనంలో బీఎస్పీ నాయకులు ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షుడు గడుగు మహేందర్ మాట్లాడుతూ.. తెలంగాణ భరోసా సభకు బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు బెహెన్ కుమారి మాయావతి హాజరు కానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో లక్ష్మికాంత్, జంగుబాపు, పోశెట్టి, ఆరీఫ్ మీర్జా, మెస్రం మీనా, నైతం కృష్ణ, సృజన్, అరవింద్ పాల్గొన్నారు.

ఫోన్ పోగొట్టుకున్న వెంటనే ఫిర్యాదు చేయాలి



ఫోన్ అందజేస్తున్న డీఎస్పీ నాగేందర్

ఇచ్చోడ: ఫోన్ పోగొట్టుకున్న వెంటనే సమీప పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్ అన్నారు. గత వారం కింద ఫోన్ పోగొట్టుకున్న బాధితుడు చిక్రం భరత్‌కుమార్‌కు శనివారం ఇచ్చోడ పోలీస్‌స్టేషన్‌లో ఫోన్ అందచేశాడు. సాంకేతిక పరిజ్ఞానంతో ఫోన్‌ను గుర్తించి, అప్పగించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఇచ్చోడ సీఐ ము దావత్ నైలు, ఎస్సై శ్రీకాంత్ పాల్గొన్నారు.

సన్మానం

నేరడిగొండ: తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ సత్యనారాయణ హైదరాబాద్‌కు బదిలీ అయ్యారు. శనివారం ఆయనను సెర్ప్ కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది, రైతులు ఘనంగా సన్మానించారు. ఆదిలాబాద్ నుంచి రాంచందర్ ఇక్కడికి మేనేజర్‌గా రానున్నారు. మేనేజర్ సత్యనారాయణ మాట్లాడుతూ ప్రజలు బ్యాంక్‌కు ఎంతగానో సహకరించారని తెలిపారు. కార్యక్రమంలో బ్యాంకు ఉద్యోగులు, రైతులు పాల్గొన్నారు.

'సూపర్' సంస్కృతి

- విస్తరిస్తున్న సూపర్‌మార్కెట్లు
- కొనుగోలుకు జనం ఆసక్తి
- మండల కేంద్రాల్లోనూ పెరిగిన ప్రాధాన్యత



ఈ చిత్రంలో కనిపిస్తున్న వృద్ధురాలిది ఆదిలాబాద్ రూరల్ మండలంలోని భీంసరి గ్రామం. పేరు సుగంధ. నిత్యావసరాలు, వస్తువుల కోసం ఒకప్పుడు కిరాణా దుకాణానికి వెళ్లేది. అయితే ప్రస్తుతం సూపర్ మార్కెట్లలో తక్కువ ధరకే వస్తువులు, సామగ్రి దొరుకుతున్నాయని.. అందుకే సూపర్ మార్కెట్కు వచ్చి తీసుకు వెళుతున్నానని చెబుతోంది. – సుగంధ

ఆదిలాబాద్: సాధారణంగా నిత్యావసరాలు, కూరగాయల కోసం కిరాణా దుకాణాలకు వెళుతుంటాం. అయితే కోవిడ్ అనంతరం ప్రజల ఆలోచన ధోరణిలో అనేక మార్పులు వచ్చాయి. అదేవిధంగా జీవనశైలిలో సైతం మార్పులు చోటుచేసుకున్నాయి. రద్దీ ప్రదేశాలు, జన సంచారం అధికంగా ఉండే మార్కెట్లకు వెళ్లాలంటే భయపడాల్సిన పరిస్థితి. ఈ నేపథ్యంలోనే కాలనీలు, పరిసర ప్రాంతాల్లోనే చిన్నపాటి కూరగాయల మార్కెట్లు ఏర్పాటయ్యాయి. అదే విధంగా అన్ని రకాల ఆహార, గృహ సంబంధిత ఉత్పత్తులు లభ్యమయ్యేలా సూపర్‌మార్కెట్లు ఏర్పడ్డాయి. సూది మొన నుంచి బియ్యం బస్తా లభ్యమవుతుండడంతో జనం సూపర్ మార్కెట్ల బాటపడుతున్నారు.



సూపర్ మార్కెట్‌లో కిక్కిరిసిన జనం

అందుబాటులో అన్ని వస్తువులు..

వంటింటికి అవసరమయ్యే వంటనూనె, మసాల దినుసులు, పప్పులు బియ్యం వంటివి, ఇంటి, వ్యక్తిగత శుభ్రతకు వినియోగించే క్లీనర్లు, సబ్బులు, వాషింగ్ సోడాలు ఉల్లిపాయలు, ఎల్లిగడ్డలు, సౌందర్య ఉత్పత్తులు, చిన్నారులకు సంబంధించిన తినుబండారాలు, గృహాలంకరణ వస్తువులు, గృహోపకరణాలు, నిత్యవసరాలు అందుబాటులో ఉంచుతుండడంతో జనం సూపర్ మార్కెట్ల వైపు చూస్తున్నారు.

ప్రత్యేక డిస్కౌంట్లు

సూపర్ మార్కెట్లో పండుగలు, ప్రత్యేక రోజులలో డిస్కౌంట్లు ఇస్తున్నారు. అదేవిధంగా ప్రతీ వస్తువుపై 40% వరకు డిస్కౌంట్ ప్రకటిస్తుండడంతో జనం సూపర్ మార్కెట్లో కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. వస్తువులు, నిత్యవసరాలు ఒకే దగ్గర దొరుకుతుండడంతో వీటి వైపు మొగ్గు చూపుతున్నారు. నగదు, శ్రమ ఆదా అయ్యేలా సూపర్ మార్కెట్లు అందుబాటులోకి వచ్చాయి.

డీలా పడ్డ కిరాణా వ్యాపారం

ఆదిలాబాద్ జిల్లాలో కిరాణా వ్యాపారం రూ. కోట్లలో జరుగుతుంది. జిల్లా కేంద్రంలోని వినాయక చౌక్, గాంధీచౌక్, అంబేద్కర్ చౌక్, శివాజీ చౌక్, అశోక్ రోడ్, భుక్తాపూర్ వంటి ప్రాంతాల్లో కిరాణా దుకాణాలు పదుల సంఖ్యలో ఉంటాయి. ఇవి వారంతో సంబంధం లేకుండా నిత్యం వినియోగదారులతో కళకళలాడుతుంటాయి. కానీ సూపర్ మార్కెట్ల ఏర్పాటుతో కిరాణా వ్యాపారంపై ప్రభావం పడుతోంది.



కొనుగోలు చేస్తున్న యువతి, కుటుంబ సభ్యులు

అందుబాటులో సూపర్ మార్కెట్లు



నిత్యావసరాల కోసం ఒకప్పుడు రైతుబజార్‌కు వెళ్లేవాళ్లం. ఒక వస్తువు కొంటే, మరోటి ఉండేది కాదు. ఇప్పుడు అటువంటి ఇబ్బందులు ఏమీ లేవు. సూపర్ మార్కెట్లు అందుబాటులో ఏర్పాటు అయ్యాయి.

– సంతోశ్, టైలర్స్ కాలనీ, ఆదిలాబాద్

అన్ని వస్తువులు ఒకేదగ్గర..



అన్ని వస్తువులు, నిత్యావసరాలు ఒకే దగ్గర దొరుకుతున్నాయి. అన్ని ఒక క్రమ పద్ధతిలో ఉంటా యి. మనకు అవసరం ఉ న్నది మాత్రమే ఎంపిక చేసుకోవచ్చు. డిస్కౌంట్లు సైతం లభ్యమవుతున్నాయి. పప్పు దినుసులు, బియ్యం వంటివి నెలకు సరిపడా ఒకేసారి తీసుకు వెళ్ళవచ్చు.

– నవ్యశ్రీ, వినియోగదారు, అనుకుంట

నాణ్యమైనవి అమ్ముతున్నాం



వినియోగదారుల తాకిడి రోజు రోజుకు పెరుగుతోంది. కస్టమర్లకు అవసరమైన అన్ని రకాలైన వస్తువులను, నాణ్యమైన బ్రాండెడ్ కంపెనీలకు చెందిన వాటిని అందుబాటులో ఉంచుతున్నాం. ఉచితంగా డెలివరీ సైతం ఇచ్చే ప్రయత్నం చేస్తున్నాం.

– గణేశ్, సూపర్ మార్కెట్ నిర్వాహకుడు, ఆదిలాబాద్

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

నేరడిగొండ: యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని తిరుమల ఫర్టిలైజర్ యజమాని దీక్షిత్ అన్నారు. నేరడిగొండ క్రికెట్ క్లబ్‌లోని 35 మంది క్రీడాకారులకు శనివారం క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారులకు కొదువ లేదని, యువకులు క్రీడల్లో రాణించేలా తమవంతు సాయం అందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో క్రీడాకారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

నార్నూర్: సామాజిక సేవ భావంతో ప్రతిఒక్కరూ ముందుకు సాగాలని మండలంలోని ఖంపూర్ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చౌహాన్ శ్రీనివాస్ అన్నారు. శనివారం జైనూర్ మండలంలోని హసేపల్లి గ్రామానికి కాంబ్లే రమేశ్ కూమార్తె వివాహానికి రూ. 10 వేల ఆర్థిక సాయం అందజేశారు. కష్టకాలంలో అదుకున్న ప్రధానోపాధ్యాయుడు చౌహాన్ శ్రీనివాస్‌ను గ్రామస్తులు అభినందించారు.

అన్నదానం

తలమడుగు: మండలంలోని బరంపూర్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల 2004– 2005 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు వేంకటేశ్వర ఆలయంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు ముడుపు కేదారేశ్వర్ రెడ్డి, కోశాధికారి భరకం మల్లేష్, ఆచారి గంగయ్య, ప్రతాప్, నాగిరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని టీచర్స్ కాలనీలో గల సాయిబాబా ఆలయ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకురాలు మాజీ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సాయి పల్లకి సేవలో పాల్గొన్నారు.

బీజేపీ ప్రభుత్వం చేసిందేమి లేదు

- ఎమ్మెల్యే జోగు రామన్న

ఆదిలాబాద్‌అర్బన్: గత తొమ్మిదేళ్ల కాలంలో బీజేపీ ప్రభుత్వం దేశానికి చేసిందేమీ లేదని, ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన బీజేపీకి ఓటు వేయవద్దని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న విమర్శించారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఆదిత్యనగర్ హనుమాన్ అలయ నిర్మాణానికి ఎమ్మెల్యే ఒక నెల వేతనమైన రూ.2.50 లక్షలను అందజేయడంతో కమిటీ సభ్యులు సన్మానించారు. బీజేపీ నేతల అసత్య ప్రచారాలను నమ్మవద్దన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, వైస్ చైర్మన్ జహీర్‌రంజానీ, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు అజయ్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బండారి సతీష్, అశోక్ స్వామి, లక్ష్మణ్, సాజిదోద్దీన్, రాం కుమార్, దమ్మపాల్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరికలు..

ఆదిలాబాద్‌అర్బన్: ఆదిలాబాద్ పట్టణంలోని కేఆర్‌కే కాలనీ, దుర్గానగర్‌కు చెందిన సుమారు 300 మంది మహిళలు ఎమ్మెల్యే జోగు రామన్న ఆధ్వర్యంలో శనివారం బీఆర్ఎస్‌లో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగు రామన్న

రోడ్డు పనులు పూర్తి చేయాలి

ఆదిలాబాద్‌అర్బన్: ఆదిలాబాద్ నియోజకవర్గంలో పంచాయత్‌రాజ్ శాఖ ద్వారా బీటీరోడ్డు రెన్యూవల్, ప్యాచ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే జోగు రామన్న కాంట్రాక్టర్లను ఆదేశించారు. శనివారం పంచాయతీ రాజ్ ఎస్ఈ కార్యాలయంలో పీఆర్ ఎంఆర్ఆర్, ఎఫ్ఎఆర్ పనులపై అధికారులు, కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహించారు. రోడ్లు, చేపట్టే పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమలో పీఆర్ ఎస్ఈ వెంకట్రావ్, ఏఈలు హరీష్, సలవోద్దిన్, సంతోశ్, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

జిల్లాలో భారీ వర్షం

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ జిల్లాలో శనివారం రాత్రి భారీ వర్షం కురిసింది. సాయంత్రం వరకు ఎండ దంచి కొట్టగా రాత్రి ఏడు గంటల సమయంలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. చిరు జల్లులతో మొదలైన వర్షం కుండపోతగా మారింరిరింది. రోడ్లన్ని జలమయమయ్యాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మావల గ్రామ శివారులోని బైపాస్ వద్ద మున్సిపల్ ఆధ్వర్యంలో నిర్మించిన స్వాగత తోరణం బోర్డు కుప్పకూలింది. చిరు వ్యాపారులు, వాహనదారులు ఇబ్బంది పడాల్సి వచ్చింది.

పనికి వస్తేనే హాజరు నమోదు చేయాలి



ఉపాధి పనులను పరిశీలిస్తున్న టీఏ

నార్నూర్: ఉపాధిహామీ పనులకు కూలీలు హాజరైతేనే ఎన్ఎంఎంఎస్ యాప్‌లో హాజరు నమోదు చేయాలని టీఏ జాదవ్ కైలాస్ నాయక్ అన్నారు. శనివారం మండలంలోని గుండాల, మహాగావ్ శేకుగూడ, గంగాపూర్ గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతీ కూలీకి 100రోజుల పని కల్పించాలన్నారు. పారదర్శకంగా పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు.

పరామర్శ

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని ప్రధాన్‌గూడ గ్రామానికి చెందిన మడావి పార్వతిబాయి అనారోగ్యంతో, మిలింద్‌నగర్‌కు చెందిన ముండే రమాకాంత్ ఆత్మహత్య చేసుకోని ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర మహిళ కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరీబాయి శనివారం బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు.

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ వైస్ ఎంపీపీ దావులే బాలాజీ తల్లి, బీఆర్ఎస్ జిల్లా నాయకురాలు సుమన్ బాయి తండ్రి ఇటీవల మృతి చెందడంతో తెలంగాణ రాష్ట మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరీబాయి వారి కుటుంబసభ్యులను శనివారం పరామర్శించారు. ఆమె వెంట సృజన్, కాటం రమేశ్, సాడిగే రాజ్‌గోపాల్, రాజారాం ఉన్నారు.

బోథ్: మండల కేంద్రానికి చెందిన జగిత్యాల డీఎస్పీ రత్నపురం ప్రకాష్ మాతృమూర్తి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. కాగా నేరడిగొండ జెడ్పీటీసీ అనిల్ జాదవ్, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డిలు శనివారం ఆయను పరామర్శించారు. తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఉప సర్పంచ్ దేవేందర్ రెడ్డి, జహీర్ ఉన్నారు.

స్వయం ఉపాధి దిశగా అడుగులు వేయాలి

- మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్

కై లాస్‌నగర్: ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకొని స్వయం ఉపాధి దిశగా అడుగులు వేయాలని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. భాగ్యనగర్ కాలనీలో న్యాక్ సంస్థ ద్వారా నిర్వహిస్తున్న కుట్టు మిషన్ శిక్షణకు హాజరవుతున్న మహిళలకు సర్టిఫికెట్లు, కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. శిక్షణ తరగతులను మహిళలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి సాధించాలన్నారు. మున్సిపల్ యంత్రాంగం తరపున డ్వాక్రా రుణాలు, శ్రీనిధి రుణాలు అందించి ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వార్డ్ కౌన్సిలర్లు సంజయ్, భూమన్న, కొండ గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

పట్టణ ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. పట్టణంలోని మహాలక్ష్మివాడలో రూ. 50 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీరోడ్డు, డ్రెయినేజీ పనులను శనివారం ఆయన పరిశీలించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటించాలని సూచించారు.



సర్టిఫికెట్లు అందజేస్తున్న జోగు ప్రేమేందర్

మానసిక వికాసానికి కళలు దోహదం

ఆదిలాబాద్: శాస్త్రీయ కళలు మానసిక వికాసానికి దోహదం చేస్తాయని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని శ్రీరామచంద్ర గోపాలకృష్ణమఠంలో వెంకటేశ్వర సంగీత నాట్య కళానిలయం ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నారులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో నృత్య శిక్షకురాలు కవిత, కోడూరు చౌదరి, విజయ్ బాబు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనకు మంత్రికి ఆహ్వానం

నార్నూర్: మండల కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 10 నుంచి 12 వరకు విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డిని శనివారం ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానించారు. మంత్రి చేతుల మీదుగా వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు జాదవ్ బాలాజీ, చౌహాన్ యశ్వంతరావు, అడే సురేశ్, ఉప సర్పంచ్ చౌహాన్ మహేందర్, పవార్ భారత్, చౌహాన్ భిక్కు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంతి ఇంద్రకరణ్‌రెడ్డి



పడకేసిన పారిశుధ్యం

ఇచ్చోడ మండలంలోని కేశవపట్నంలో పారిశుధ్యం పడకేసింది. మజీద్‌గల్లి, దాని పక్కన్న ఉన్న మరోగల్లీలో మురుగునీరు రోడుపై ప్రవహిస్తోంది. దీంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. కనీసం నడవడానికి కూడా వీలు లేకుండా పోయింది. అయినా.. పంచాయతీ సిబ్బంది పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు. - ఇచ్చోడ

వారోత్సవాలను జయప్రదం చేయండి

ఎదులాపురం: మేడే వారోత్సవాలను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలో వారోత్సవాల కరపత్రాలు విడుదల చేశారు. ప్రపంచ కార్మిక ఐక్యతకు మేడే సంకేతం అన్నారు. కార్మికులు హక్కులు, 8 గంటల పనిదినం కోసం 1886లో చికాగో మార్కెట్‌లో చేసిన పోరాటం, కార్మిక వర్గం చేసిన అనేక పోరాటాల త్యాగాల ఫలితమే నేడు కార్మికులు అనుభవిస్తున్న హక్కులు, చట్టాలు అని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న, నాయకులు సురేందర్, పొచ్చన్న, మంత్రి స్వామి, రమాకాంత్, తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

తాంసి: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై లాల్‌సింగ్ నాయక్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తుల నుంచి ఫోన్ కాల్స్ వస్తే ఎలాంటి సమాచారం ఇవ్వొద్దన్నారు. ఆధార్ కార్డ్, పాన్‌కార్డ్, బ్యాంక్ ఖాతా వివరాలను చెప్పవద్దన్నారు. కార్యక్రమంలో సిబ్బంది సుభాష్, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎస్సై లాల్‌సింగ్ నాయక్

వీవోఏల నిరసన

నేరడిగొండ: న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని వీవోఏలు చేపడుతున్న నిరవధిక సమ్మె కొనసాగుతోంది. శనివారం మండల కేంద్రంలో భిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ.. సమస్యలను పరిష్కరించాలని గత కొన్ని రోజుల నుంచి సమ్మె చేస్తున్నా.. ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు.

ఉట్నూర్‌రూరల్: వీవోఏల సమ్మెకు ప్రజా సంఘాల నాయకులు, ఎస్సీ, ఎస్టీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు జాదవ్ రాంకిషన్‌నాయక్, నేతావత్‌రాందాస్, గ్రామీణ పేదల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామారావులు మద్దతు తెలిపారు. వారు మాట్లాడుతూ.. వెంటనే ప్రభుత్వం వీవోఏల సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో కమల, రాజమణి, సరోజ, రాజీఒద్దిన్, గట్కు రమేశ్, వీవోఏలు పాల్గొన్నారు.

ఇచ్చోడ: మండల కేంద్రంలో వీవోఏలు చేస్తున్న సమ్మె శనివారం 12వ రోజుకు చేరుకుంది. సమస్యలు పరిష్కరించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. రూ. 26 వేల వేతనంతో పాటుగా ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లక్ష్మణ్, సుభాష్, మాధవ్, మారుతి, అనిత, విద్య, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

బోథ్: మండల కేంద్రంలో శనివారం వీవోఏలు భిక్షాటన చేశారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, రూ. 26 వేల వేతనం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు స్వామి, కార్యదర్శి పవార్ శ్యామ్ రావ్, రాజు, సాగర్, దత్తు, మాణిక్ రావ్, జ్యోతి, సవిత, భిక్కు, రాజశ్రీ, సాయి, తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న వీవోఏలు

సభను జయప్రదం చేయండి

తాంసి: భద్రాచలం పట్టణంలో మే 5, 6 తేదీల్లో జరిగే టీఏజీఎస్ రాష్ట్ర మూడో మహాసభలను జయప్రదం చేయాలని టీఏజీఎస్ జిల్లా కార్యదర్శి పూసం సచిన్ పిలుపునిచ్చారు. శనివారం భీంపూర్ మండలంలోని శాంతినగర్‌లో గ్రామస్తులతో కలిసి వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. జాతీయ నేతలు బృందకారత్, మిడియం బాపురావు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. ఆదివాసీలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు విశాల్, శంకర్, రాజు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు